బాల్య వివాహాలు చట్టవిరుద్ధం


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

మడకశిర(అగళి): బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తహసీల్దార్ జిలాని తెలిపారు. గురువారం అగళి ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో తల్లిదండ్రులకు బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. బాల్య వివాహాలు చేయడం నేరమని ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ విషయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎంపీపీ రేణుక, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రొళ్ల: బాలికలకు యుక్త వయస్సు వచ్చిన తర్వాతే తల్లిదండ్రులు వివాహాలు జరపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. గురువారం రొళ్లలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో అంగనవాడీ సిబ్బందికి బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బాలికలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు.

గుడిబండ: బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ పద్మావతి, ఎంపీడీఓ రామారావు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అంగనవాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలు కలిగిన ఆడపిల్లలను ఒక సమూహంగా ఏర్పాటు చేసి వారికి ప్రతి నెలా మూడు సమావేశాల ఏర్పాటు చేసి బాల్య వివాహాలు, చిన్న వయస్సులో గర్భం వస్తే కలిగే నష్టాల గురించి వివరించాలన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే తిప్పేస్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు


వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

● శుభాకాంక్షలు తెలిపిన విజయసాయిరెడ్డి

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం జన్మదిన వేడుకలకు వేదికగా మారింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే జెడ్పీటీసీలు, ఎంపీపీలు, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీల సమక్షంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఎంఈఓలు, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, అధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కూడా ట్విట్టర్‌లో ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తన జన్మదిన సందర్భంగా పట్టణంలోని వివిధ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు.

వృద్ధాశ్రమ అభివృద్ధికి సహకారం

మడకశిరరూరల్: ఆమిదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో గురువారం వృద్ధుల మధ్య ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం వృద్ధులకు ఎమ్మెల్యే భోజనం వడ్డించి పండ్లు, స్వీట్లు అందించారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గుడిబండ: మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి జన్మదిన వేడుకలను ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సర్పంచ్‌లు రంగస్వామి, లక్ష్మీనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్, నాయకులు రామచంద్ర, బోరప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో యువకుడి ప్రతిభ


నగదు బహుమతిని, ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో మే 30, 31న జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో హిందూపురానికి చెందిన యువకుడు ఆఫ్రీద్ ఖాన్ ప్రతిభ కనబరిచాడు. చదరంగం పోటీల్లో 6.5 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మస్తాన్ బాబు యువకుడికి రూ.20 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ, మెడల్‌ను అందజేశారు. చదరంగం రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంపై కోచ్ ఆరీఫ్‌వుల్లా తదితరులు యువకుడిని అభినందించారు.

పాఠశాల ఆవరణలో గుంతల పూడ్చివేత


పాఠశాల ఆవరణలో గుంతలను మట్టితో పూడ్చిన దృశ్యం

మడకశిరరూరల్: తురకవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గుంతలు పడడంతో కొద్దిపాటి వర్షం పడితే నీరు నిల్వ ఉంటుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యను గుర్తించిన జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ ప్రత్యేక చొరవతో మండల పరిషత్ నిధుల నుంచి గుంతలను మట్టితో పూడ్చి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చేశారు. ప్రస్తుతం ఎంత వర్షం వచ్చిన నీరు నిల్వ ఉండదని విద్యార్థులకు కూడా ఇబ్బంది లేదని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

మాజీ ఎంపీపీ మృతి


గోవిందప్ప(ఫైల్)

గుడిబండ: కల్లురొప్పం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేత గోవిందప్ప(65) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ జి.బి.శివకుమార్, సర్పంచ్ అశ్వత్, అనంతరాజు తదితరులు గోవిందప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రాగుల పంపిణీ


శెట్టిపల్లిలో రాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి, కొండంపల్లి, మునిమడుగు, అడదాకులపల్లి తదితర గ్రామాల్లోని రేషన్ షాపుల్లో గురువారం రాగులు పంపిణీ చేశారు. మండలంలోని 37 చౌక దుకాణాలు, 16,257 రేషన్ కార్డులు ఉండగా.. ప్రతి కార్డుకు కేజీ రాగులను పంపిణీ చేయనున్నట్లు సీఎస్‌డీటీ ప్రభావతి తెలిపారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

లేపాక్షి: మండలంలోని కల్లూరు, నాయనిపల్లి, కొండూరు, మానేపల్లి, లేపాక్షి పంచాయతీలకు చెందిన 65 మంది గర్భిణులకు వైద్యాధికారి వెంకటచిరంజీవి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై వివరించారు. అనంతరం పరిగి గ్రామానికి చెందిన దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు వేణుగోపాలరావు గర్భిణులకు మధ్యాహ్న భోజనం సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హుస్సేన్‌బి, ఎంపీహెచ్‌ఈఓ సుదర్శన్‌బాబు, సుబ్రమణ్యం, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి సూపర్‌వైజర్ గోవిందప్ప, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కరానికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న ఎంపీడీఓ సోనిబాయి

మడకశిరరూరల్: మణూరు గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ సోనిబాయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆదాయవనరుల పెంపుపై దృష్టి సారించాలన్నారు. ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

30 వరకూ మలేరియా నివారణ మాసోత్సవం


ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలోని గ్రామాల్లో గురువారం నుంచి జూన్ 30 వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. ఆర్ అనంతపురం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి తొలిరోజు మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు. జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అధికారిగా అనిల్‌కుమార్

మడకశిర: మడకశిర సబ్ ట్రెజరీ అధికారిగా అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ముదిగుబ్బ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సబ్ ట్రెజరీ అధికారి ఉమాదేవిని ప్రభుత్వం అనంతపురం జిల్లా రాయదుర్గానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లా కేంద్రానికి బస్సులు నడపాలని వినతి


డిపో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రం నుంచి సత్యసాయి జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని పెనుకొండ డిపో అధికారి బాబన్నకు గురువారం రొద్దం గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. పెనుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పావగడ నుంచి ఉదయం 5 గంటలకు జిల్లా కేంద్రానికి నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మళ్లీ ఉదయం 9 గంటలకు మరో బస్సు సర్వీసు నడపాలని కోరారు. పుట్టపర్తి ఆస్పత్రికి వెళ్లే రోగులకు, ఉద్యోగులకు, ఇతర ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా, ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరసింహారెడ్డి, రవిశేఖర్ రెడ్డి, సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన


జేపీ శాండ్ కంపెనీ డంప్ చేసిన ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న సెబ్ అధికారులు

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళి నది నుంచి కాంట్రాక్టర్ అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను గురువారం హిందూపురం సెబ్ అధికారులు పరిశీలించారు. జేపీ కన్‌స్ట్రక్షన్ శాండ్ కంపెనీకి చెందిన కాంట్రాక్టర్ రీచ్ నుంచి ఇసుకను బయటకు తోలి వేరే ప్రాంతంలో డంప్ చేశారు. సెబ్ అధికారులు డంప్ చేసిన ప్రదేశాన్ని పరిశీలించి, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. తదుపరి చర్యలకై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

గుండమల మెడికల్ ఏజెన్సీ తనిఖీ


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ నవీన

పరిగి: మండల కేంద్రంలో అనధికారకంగా నిర్వహిస్తున్న గుండుమల మెడికల్ ఏజెన్సీ కేంద్రాన్ని గురువారం పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని మడకశిర బస్టాండులో గత కొన్నేళ్లుగా గుండుమల మెడికల్ ఏజెన్సీ పేరుతో షమీవుల్లా వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అనధికారకంగా హైడోస్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్‌లు రోగులకు ఇస్తున్నట్లు మండలంలో ప్రజలు విమర్శిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా వైద్యాధికారులు ఆదేశించడంతో మెడికల్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించామని డాక్టర్ నవీన తెలిపారు. రోగులకు వైద్య చికిత్సలు నిర్వహించరాదని నోటీసులు ఇచ్చినా నిర్వాహకుడు షమీవుల్లా తన పంథా మార్చుకోలేదని వెల్లడించారు. దీనిపై తక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

మడకశిర: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయి. మడకశిర పట్టణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. మడకశిర బాలుర ఉన్నత పాఠశాలలో 260, బాలికోన్నత పాఠశాలలో 240, సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 230 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 730 మంది విద్యార్థులు నియోజకవర్గ వ్యాప్తంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

గురుకుల పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

గోరంట్ల: స్థానిక రాజీవ్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన 7 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యయుడు నాగరాజు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన హేమశ్రీ, గంగోత్రి టేకులోడు గురుకుల పాఠశాలకు.. అదే విధంగా అక్షయ నసనకోట గురుకుల పాఠశాలకు, కమల గోనబావి గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారన్నారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

అసిస్టెంట్ కమిషనర్‌గా రాంభూపాల్‌రెడ్డి


హిందూపురం టౌన్: స్థానిక పురపాలక సంఘం అసిస్టెంట్ కమిషనర్‌గా రాంభూపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. మున్సిపాలిటీలో కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టును ప్రస్తుత బదిలీల్లో భర్తీ చేశారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్ బదిలీపై విచ్చేసి బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టును భర్తీ చేశారు.

సమయపాలన తప్పనిసరి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

పెనుకొండ రూరల్: సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని డీఎల్‌డీఓ శివారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కోనాపురం, పట్టణంలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. ఉద్యోగులు డ్రెస్ కోడ్ విధిగా పాటించాలని ఆదేశించారు. ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకటేశ్‌కు ఘన సన్మానం


ఎమ్మెల్యే వెంకటేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, అతని తండ్రి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప లను వెంకటమ్మనహళ్లి గ్రామస్థులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన నాగలమడక హోబళి వాసులను తానెన్నడు మరువనని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సైతం ఇదే రీతి లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో బత్తినేని నాని, చిన్న కిష్టప్ప, బొమ్మయ్య, శరత్ బాబు, సురేశ్, బావిరెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుకే తొలి ప్రాధాన్యత


చిన్నారులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తన ముందున్న సవాళ్లలో చదువుకే తొలి ప్రాధాన్యత కల్పిస్తానని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన పాఠశాల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. తుమకూరులో చదివే స్థానిక విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడంతో పాటు పాఠశాల ఫీజులు చెల్లించడానికి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే వాడినని తెలిపారు. అయితే ఇప్పటి నుంచి వాటి నిర్వహణకు ప్రత్యేక వ్యక్తిని నియమించానన్నారు. ఎలాంటి సమయంలో వచ్చినా విద్యాభ్యాసానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బీఈఓ అశ్వర్థనారాయణ మాట్లాడుతూ తాలూకాలో 30 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, 252 ప్రభుత్వ, 72 ఎయిడెడ్, తదితర పాఠశాలలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పదిలో ఎక్కువ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు పురస్కారాలు అందించారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యా శాఖ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు చంద్రప్ప

అమరాపురం: విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని తెలుగు ఉపాధ్యాయుడు చంద్రప్ప సూచించారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం తెలుగు చదవడం, రాయడం మాట్లాడడంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషపై విద్యార్థులు మంచి పట్టు సాధించాలన్నారు. భాష ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొండమనాయుని పాళెం గ్రామం సమీపంలో గురువారం ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. నల్లమాడ వైపు నుంచి కదిరికి ఆటో వస్తుండగా కొండమనాయుని పాళెం మలుపు వద్ద అదుపు తప్పింది. ఇందులో ప్రయాణిస్తున్న మాబూసాబ్, ఫక్రుద్దీన్, శ్రీనివాసులు, హసన్‌సాబ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తలుపుల: మండలంలోని రాజనోల్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఐ మున్వర్ బాషా ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడి చేశారు. 5 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.65,910 స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్‌స్టేషన్లు అంటే భయపడొద్దు


మాట్లాడుతున్న సీఐ కాంతరెడ్డి

పావగడ: పోలీస్‌స్టేషన్లు, పోలీసులు అంటే భయపడకూడదని, ఎలాంటి మధ్య వర్తులు లేకుండా ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చని సీఐ కాంతరెడ్డి పేర్కొన్నారు. వైఎన్ హొసకోటలోని ఆర్‌పీపీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన పోలీసుల జన సంపర్కసభలో ఆయన మాట్లాడారు. మాజీ గ్రామ పంచాయతీ సభ్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ ఇటీవల బీట్ వ్యవస్థ లేక పోవడంతో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, రాత్రి పూట ప్రజలు ఒంటరిగా వెళ్లడానికి భయ పడుతున్నారన్నారు. సీఐ మాట్లాడుతూ ప్రతి పల్లెకు ఇద్దరు బీట్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. పలువురు యువకులు మాట్లాడుతూ గ్రామంలో ట్రాఫిక్ సమస్య పెరిగి పోతోందని పరిష్కరించాలని కోరారు. గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుని త్వరలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని సీఐ అన్నారు. ఎస్ఐ అర్జున్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ


కోడిపల్లిలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


తురకలాపట్నంలో వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని 12 ఆర్‌బీకేల్లో విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం మండల వ్యాప్తంగా 244 మంది రైతులకు 128 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామని ఏఓ శ్రీలత తెలిపారు. అలాగే కోడిపల్లి పంచాయతీ సర్పంచ్ మంజునాథ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రుద్రప్ప తదితరులు రైతులకు వేరుశనగ పంపిణీ చేశారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఏఓ నివేదిత తెలిపారు. ఎక్కడైనా విత్తనకాయలు నాణ్యత లేకుంటే వెనక్కి ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన విత్తన కాయల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాధవి శ్రీనివాస్, కలిపి సింగిల్ విండో చైర్మన్ కేపీ శ్రీనివాసులు, నాయకులు రాజారెడ్డి, వీఏఏ నవీన్, రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగుతోంది. గురువారం వ్యవసాయాధికారి వంశీకృష్ణ మాట్లాడుతూ రెండో రోజు 133 మంది రైతులకు 85.8 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం


భూ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆర్డీ మల్లికార్జున

రొళ్ల: పేద రైతుల అభివృద్ధే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం హులికుంట గ్రామంలో 57 మంది ఎస్సీ, బీసీ సన్న, చిన్నకారు రైతుల భూముల్లో అభివృద్ధి పనులను సీడీసీ మెంబర్లు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతుల పొలాలలో రాళ్లు, ముళ్లకంపలతో పాటు ఎగుడు, దిగుడుగా ఉన్న వాటిని జేసీబీతో చదును చేస్తామన్నారు. ఆర్డీటీ తరపున భూ అభివృద్ధి పనులతో పాటు నీటీ వసతి కలిగిన రైతులకు కొబ్బరి చెట్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇతరాత్ర వ్యవసాయ పని ముట్లను రాయితీతో అందిస్తామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు, ఆర్డీటీ సంఘ సభ్యులకు చేయూత అందించడంతో పాటు ఆర్డీటీ సెట్‌లో ప్రతిభ కనబర్చిన పదో తరగతి విద్యార్థులను వివిధ కార్పొరేట్ కళాశాలల్లో చదివిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న సాకే హరి

పెనుకొండ: ఎస్సీ, ఎస్టీల సమస్యల సాధనకై ఉద్యమిద్దామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. తరాలు మారినా తలరాత మారని ఎస్సీ, ఎస్టీల బతుకులు మార్చేవారు కరువయ్యారన్నారు. నేటికీ కుల ఆచారాలను పాటిస్తూ అనేక అవమానాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. పేదరికం, నిరుద్యోగం పట్టి పీడిస్తున్నాయన్నారు. ఇతర సమస్యలపై చర్చించారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడిగా రవీంద్రను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రవీంద్ర, అంజినేయులు, నరసింహమూర్తి, హనుమంతు, మారుతి, సురేష్, రామకృష్ణ, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.